PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 347 పేజీలు - 08 మంగళవారం 10 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

పాలమూరుకు నీళ్లివ్వని గత పాలకులు

- కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు
- పాలమూరుకు నీళ్లు ఇవ్వలేదు.. పరిశ్రమలు తీసుకురాలేదు
- పదేళ్లలో రూ.8.15 లక్షల కోట్ల అప్పులు చేశారు
- తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలపడమే నా లక్ష్యం
- ముఖ్యమంత్రిగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు
- గత పాలకులు మారినా పాలమూరు ప్రజల తలరాతలు మారలేదు



తొలి అక్షరం/కొడంగల్,నవంబర్ 9:తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని వెల్లడించారు. మిగతా2లో...



చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

- జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- శాంతి ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతు
- మానవతా దృక్పథానికే ప్రాధాన్యమని స్పష్టీకరణ
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతల చర్చ

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 9: రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతియుత పరిష్కారం కనుగొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, తాజా పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ తనవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా మిగతా2లో...

వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్

దంపతుల ముగింపు

- వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ అన్నా కొణిదెల ముగింపు!
- పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయం
- పిల్లల బాధ్యతలు కొనసాగిస్తాం.. వ్యక్తిగత గోప్యతను గౌరవించండి



తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 9: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోతున్నట్లు ఇద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.జీవితంలో ఎంతోకాలం కలిసి ప్రయాణించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని వారు వెల్లడించారు. భార్యాభర్తల బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా కొనసాగుతామని తెలిపారు. తమ పిల్లలకు అంకితమైన తల్లిదండ్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తామని, వారి సంతోషం, మిగతా2లో...

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్‌ను

ఖండించిన కేటీఆర్

- కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అడ్డుకోవడం అప్రజాస్వామికమని విమర్శ



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 9 : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. కోస్గిలో మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న నరేందర్‌రెడ్డిని పరిగి బహార్‌పేట్ చౌరస్తా వద్ద అరెస్ట్ చేయడం మిగతా2లో...

తెలంగాణలో జనగణనకు

ముహూర్తం ఖరారు

- జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ.. జనవరి 10 నుంచి స్వీయ జనగణనకు అవకాశం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 9 : తెలంగాణ రాష్ట్రంలో జనగణన-2027 నిర్వహణకు ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జనగణన నోటిఫికేషన్‌ను రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో రెండో విడతలో భాగంగా జనాభా లెక్కల సేకరణను 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నారు. అంతకుముందు ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి 24 వరకు అవకాశం కల్పించారు. ఈ స్వీయ జనగణన ప్రక్రియను ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.స్వీయ జనగణన గడువు ముగిసిన అనంతరం జనవరి 25 నుంచి జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారు. జనాభా లెక్కల సేకరణ పూర్తయిన తర్వాత వివరాల మిగతా2లో...



రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు.. అప్పీల్ కోసం నాలుగు వారాలపాటు శిక్ష అమలు నిలిపివేత

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 9: కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయలేదని తేల్చిన తెలంగాణ హైకోర్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. జస్టిస్ కె. లక్ష్మణ్ ఈ మేరకు కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై తీర్పు మిగతా2లో...

అందరి సహకారంతోనే కరీంనగర్ అభివృద్ధి

- రాజకీయాలకు అతీతంగా పనిచేద్దాం: బండి సంజయ్, పొన్నం ప్రభాకర్



జనవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా!

- యూపీ, పంజాబ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు



పాలమూరుకు నీళ్లివ్వని గత పాలకులు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన రైతన్నతో ఆత్మీయ సభలో రైతులతో మాట్లాడిన ఆయన, పాలమూరు ప్రాంత అభివృద్ధి, గత ప్రభుత్వ పాలన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పలు వ్యాఖ్యలు చేశారు. **ఎందరో నాయకులు వచ్చినా పాలమూరు బతుకులు మారలేదు**గతంలో ఎంతోమంది నాయకులు, మంత్రులు పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఈ ప్రాంత ప్రజల తలరాతలు మారలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు ప్రజలు ఎప్పటినుంచో సాగునీరు, పరిశ్రమల కోసం నాయకులను అడుగుతూనే ఉన్నారని తెలిపారు. అయినా ఈ జిల్లాకు అవసరమైన నీళ్లు, పరిశ్రమలు అందించలేకపోయారని విమర్శించారు. పాలమూరులో సాగునీటి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వలసలు కొనసాగాయని, రైతుల పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొందని గుర్తుచేశారు. **కేసీఆర్ పాలమూరు రుణం తీర్చుకుంటారని ఆశించాం**గతంలో పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి గుండెల్లో పెట్టుకున్నారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పాలమూరు నుంచే ఎంపీగా గెలిచిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాంతానికి న్యాయం చేస్తారని భావించామని చెప్పారు. పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటారని, ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు నీరందిస్తారని ఆశించామని తెలిపారు. అయితే ఆ ఆశలు నెరవేరలేదని విమర్శించారు. **మా గుండెలపై తన్ని కృష్ణా నదిలో పడేశారు** కేసీఆర్ పాలమూరు ప్రజలకు కనీస కృతజ్ఞత చూపలేదని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను గెలిపించి, ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లిన పాలమూరు ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. పాలమూరు జిల్లాపై కక్ష పెంచుకున్నారని, ఈ ప్రాంతానికి చుక్కనీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు ప్రజల గుండెలపై తన్ని కృష్ణా నదిలో పడేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. **రూ.8.15 లక్షల కోట్ల అప్పుల భారం** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంపై రూ.8.15 లక్షల కోట్ల అప్పులు చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులమయం చేశారని విమర్శించారు. ఇంతటి అప్పుల భారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం తమ ప్రభుత్వానికి సవాలుగా మారిందని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆరోపించారు. **ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం** తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించే పరిస్థితి కూడా లేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న అప్పుల సమస్యను అధిగమించేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను గాడిలో పెడుతూ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పాలనను సక్రమంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

తెలంగాణను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పాలమూరు ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణలో జనగణనకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన, సవరణల కోసం మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారు.

ఈ జనగణనకు 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా నిర్ణయించారు.కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది.

ఉత్తర్వులను అన్ని శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జనగణన అధికారులకు పంపించారు.ఇప్పటికే తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన ప్రక్రియను మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించారు. ప్రస్తుతం రెండో విడత జనాభా లెక్కల సేకరణకు అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనగణన ద్వారా సేకరించే వివరాలు ప్రభుత్వ పథకాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, వనరుల కేటాయింపులకు ఉపయోగపడనున్నాయి.

అందరి సహకారంతోనే కరీంనగర్ అభివృద్ధి

తొలి అక్షరం/కరీంనగర్, నవంబర్ 9 : కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధి పనులకు కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.17 కోట్లు, పట్టణ సవాళ్ల నిధి కింద రూ.80 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయా లని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నా రు. నగరంలోని 23, 25, 26, 46వ డివిజన్లలో రూ.4.5 కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మా ణ పనులకు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కృత్రిమ మేధ ఆధారిత దాడులతో ఆర్థిక సంస్థలకు ముప్పు: సీపీ సజ్జనార్

తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 9: బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, త్వరిత వస్తు సరఫరా సంస్థలు తమ సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దాడులకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.కృత్రిమ మేధ సాధనాలతో సంస్థల నెట్‌వర్క్‌లలోని లోపాలను గుర్తిస్తున్న నేరగాళ్లు,



చెల్లింపు వ్యవస్థలను దుర్వినియోగం చేసి ఇతరుల ఖాతాల ద్వారా నగదును మళ్లిస్తున్నారని తెలిపారు. వినియోగంలో లేని పాత సాంకేతిక అనుసంధానాలను తొలగించాలని, సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, ఉద్యోగులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు ముందస్తు పరీక్షలు నిర్వహించాలని, ఐటీ, సైబర్ భద్రతా బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ తెలిపారు.

దీపావళి పాగతో క్షీణించిన గాలి నాణ్యత!

- **విజయవాడలో 112 డెసిబుల్స్‌కు చేరిన శబ్ద తీవ్రత.. ఢిల్లీలో 400కు ఎక్యూఐ**

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 9:దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఆంధ్రప్రదేశ్‌లో వాయు, శబ్ద కాలుష్యం పెరిగింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరాల్లో గాలి నాణ్యత క్షీణించింది. రాష్ట్రంలోని 15 ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 101 నుంచి 200 మధ్య నమోదైంది.విశాఖపట్నంలో గరిష్ఠ శబ్ద తీవ్రత 111 డెసిబుల్స్‌కు చేరగా, విజయవాడలో 112 డెసిబుల్స్ నమోదైంది. తిరుపతిలో అత్యధికంగా 191 ఎక్యూఐ నమోదైంది. నెల్లూరులో 175, శ్రీకాకుళంలో 170, ఏలూరులో 118గా నమోదయ్యాయి. అమరావతి, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత ఒక్కసారిగా పడిపోయింది.దేశ రాజధాని ఢిల్లీలో ఎక్యూఐ 400కు చేరడంతో పరిస్థితి ఆందోళన కరంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని లోనీలోనూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయింది.



పీఎం2.5, పీఎం10 ధూళి కణాల స్థాయిలు అధికంగా నమోదయ్యాయి.ఎక్యూఐ 101 నుంచి 200 మధ్య ఉంటే ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబం ధిత సమస్యలు ఉన్నవారికి శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. కాలుష్యాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యత, శబ్ద తీవ్రత కొలిచే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. విశాఖలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపింది.

చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మోదీ పునరుద్ఘాటించారు.**మానవతా దృక్పథానికే ప్రాధాన్యం** ప్రస్తుత సంక్షోభంలో భారత్ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోందని మోదీ తెలిపారు. యుద్ధం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాంతి స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వివాదాన్ని పరిష్కరించుకోవడానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని భారత్ మొదటి నుంచీ చెబుతోందని గుర్తుచేశారు. శాంతియుత పరిష్కారం కోసం జరిగే ప్రయత్నాల్లో భారత్ భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీకి తెలిపారు.**అబుధాబి సమావేశంపై జెలెన్‌స్కీ వివరణ**మోదీతో మాట్లాడిన విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. తాజా దౌత్య పరిణామాలు, అబుధాబిలో జరగనున్న సమావేశానికి ఉక్రెయిన్ చేస్తున్న సన్నాహాల గురించి ప్రధానికి వివరించినట్లు తెలిపారు. యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని, రష్యా కూడా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ముందుకు రావాలని అన్నారు. ఇది యుద్ధాన్ని కొనసాగించే సమయం కాదని, ముగించాల్సిన సమయమని మోదీ పలుమార్లు స్పష్టం చేసినట్లు జెలెన్‌స్కీ గుర్తుచేశారు.**ధాన్యం రవాణాకు భారత్ సహకారం కోరిన జెలెన్‌స్కీ** నల్ల సముద్రం మీదుగా ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడుతున్న అంశాన్ని కూడా జెలెన్‌స్కీ ప్రస్తావించారు. ఆహార భద్రతకు విఘాతం కలగకుండా ధాన్యం రవాణా కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, న్యూఢిల్లీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు తొలగించడం ద్వారా ప్రపంచ ఆహార భద్రతకు తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. **ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ** భారత్-ఉక్రెయిన్ మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకా రాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపై కూడా మోదీ, జెలెన్‌స్కీ చర్చించారు. ఇరు దేశాల ప్రజల పరస్పర ప్రయోజనాల కోసం సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించారు. యుద్ధ పరి ష్కారం తో పాటు శాంతి స్థాపన, మానవతా అంశాలపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ దంపతుల ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యమని పేర్కొన్నారు.ఈ వ్యక్తిగత మార్పును అర్థం చేసుకుని, తమ గోప్యతను గౌరవించాలని ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులను కోరారు. ఇంతకాలం తమకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను మాత్రం సంయుక్త ప్రకటనలో వెల్లడించలేదు. పవన్ కల్యాణ్, అన్నా 2013 సెప్టెంబర్ 30న వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జనవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా!

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 9:దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే ఏడాది జనవరి మొదటి అర్ధభాగంలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో 2027లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది.ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లో పర్యటనలు పూర్త య్యాయి. ఉత్తరప్రదేశ్‌లో ఒక పర్యటన పూర్తికాగా, మరో రెండు పర్యటనలు నిర్వహించాల్సి ఉంది. గోవాలో పర్యటన ఇంకా జరగాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా అధికారుల పర్యటనలు పూర్తయ్యే అవకా శం ఉంది.ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఐదు రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశ మవుతారు. శాంతిభద్రతలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షిస్తారు. ఉత్తరప్రదేశ్‌లో అధిక నియోజకవర్గాలు ఉండటంతో పలు విడతల్లో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌లో ఒకే విడతలో ఎన్నికలు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఎన్నికల తేదీలు, పోలింగ్ విడతలపై ఎన్నికల సంఘం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

వెలువరించారు. అయితే తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాలపాటు నిలిపివేశారు.**నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని వినతి** రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న తమ భూములను తొలగించాలని కొందరు బాధితులు అధికారులను కోరారు. ఈ వినతిని పరిశీలించి 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. అయినప్పటికీ నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.**అధికారుల వివరణపై న్యాయస్థానం అభ్యంతరం** కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జూలై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సందర్భంగా కలెక్టర్ సమర్పించిన వివరణలోని అంశాలు, అధికారిక రికార్డుల్లోని వివరాల మధ్య వ్యత్యాసాలను న్యాయస్థానం గుర్తించింది. ఆర్డీఓ, తహసీల్దార్ తదితరుల విచారణకు సంబంధించిన పత్రాల్లో సంతకాలు లేకపోవడాన్ని కూడా ప్రస్తావించింది.కోర్టు ఆదేశాలను తెలిసి కూడా అమలు చేయడంలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారని పేర్కొంటూ కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునేందుకు నాలుగు వారాలపాటు శిక్ష అమలును నిలిపివేసింది.

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా అని నిలదీశారు.ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతోందని కేటీఆర్ అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే పాలనగా మార్చుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన, కార్యకర్తల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే, ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రముఖ శాస్త్రవేత్త హర గోవింద ఖురానాకు ఘన నివాళి



తొలి అక్షరం/జవహర్ నగర్, నవంబర్ 9:తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్త హర గోవింద ఖురానా 15వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కమలా నగర్‌లోని సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రజాతంత్ర ఉద్యమ కార్యదర్శి పి. సత్యం, మల్కాజిగిరి మాజీ కౌన్సిలర్ చల్లా లీలావతి ఖురానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమాచార్యులు మాట్లాడుతూ జన్యుశాస్త్ర పరిశోధనల్లో ఖురానా చేసిన కృషి ప్రపంచ శాస్త్రవిజ్ఞాన అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. యాదగిరిరావు మాట్లాడుతూ ఆయన పరిశోధనలు వైద్యరంగంలోనూ కీలక పురోగతికి మార్గం చూపాయన్నారు.కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, జె. చంద్రశేఖర్, ఎన్. శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, జి. శ్రీనివాసులు, రుక్మయ్య, ఉదయభాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి.. యువతకు ఉద్యోగాలే లక్ష్యం కావాలి

- యువతకు ది మిషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ కొట్టే ఏడుకొండలు పిలుపు





తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 9:డ్రగ్స్, గంజాయి, మద్యం, బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని ది మిషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ కొట్టే ఏడుకొండలు యువతకు పిలుపునిచ్చారు. మునిపంపుల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పోలీస్, ఎక్సైజ్ శాఖల సహకారంతో 'హలో యువత.. ఎటువైపు నీ భవిత!' నినాదంతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయన్నారు. రామన్నపేట ఎస్ఐ గోపతి సతీష్ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వల్ల యువత ఆర్థికంగా నష్టపోతున్నారని హెచ్చరించారు. విద్య, ఉద్యోగం, క్రీడలు, సామాజిక సేవపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాన్ని వ్యసనాలకు దూరంగా ఉన్న ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం కోరారు.కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్ కుమార్, ఉపసర్పంచ్ తాళ్ల క్రాంతికుమార్, రాంరెడ్డి, నీలం శేఖర్, ఉపాధ్యాయులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపాల వెలుగులో అయ్యప్ప దీక్ష..
ఆత్మశుద్ధికి ఆధ్యాత్మిక మార్గం!

దీపారాధనలో దైవత్వం.. మాలధారణలో నియమబద్ధత.. శరణుఘోషలో సమానత్వం

కార్తీక మాసం... ప్రకృతి పులకించే పవిత్ర సమయం! భక్తి పరిమళాలు గాలిలో కలిసే దైవిక సందర్భం! తెల్లవారుజామున నదీ స్నానాలతో మొదలై.. శివనామ స్మరణతో సాగిడ సాయంత్రం దీపాల వెలుగుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే అపురూపమైన మాసం కార్తీకం!

కార్తీకం అంటే ఒక మాసం మాత్రమే కాదు... మనిషిలోని మానవత్వాన్ని మేల్కొలిపే మహత్తర సందేశం! చీకటిని చీల్చే చిన్న దీపంలా.. మనసులోని అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానజ్యోతిలా... భక్తుడి జీవితంలో కొత్త వెలుగులు నింపే పవిత్ర సమయం!

కార్తీక సోమవారాల్లో శివాలయాల బాట పట్టే భక్తులుడ తులసి కోట ముందు దీపాలు వెలిగించే మహిళలు... నదీతీరాల్లో కార్తీక దీపాలను వదిలే ఆధ్యాత్మిక దృశ్యాలు.. ప్రతి ఇంటా వినిపించే హరిహర నామస్మరణలు.. ఇవన్నీ కలిపితే కనిపించేది భారతీయ సంస్కృతిలోని అద్భుతమైన ఆధ్యాత్మిక వైభవం!

అసలు కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణకు ఎందుకంత ప్రాధాన్యం?

కార్తీక మాసం రాగానే అయ్యప్ప భక్తుల హృదయాల్లో ఒక కొత్త ఉత్సాహం మొదలవుతుంది. మెడలో తులసి లేదా రుద్రాక్ష మాల ధరించి, నల్లని వస్త్రాలు కట్టుకొని, స్వామియే శరణం అయ్యప్ప అంటూ మండల దీక్షకు సిద్ధమవుతారు. సాధారణంగా ఈ సమయంలో ప్రారంభించే 41 రోజుల మండల దీక్ష భక్తుడి జీవితంలో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అధ్యాయంగా నిలుస్తుంది.

అయ్యప్ప మాల అంటే మెడలో ధరించే కొన్ని పూసలు కాదు... అది మనిషి తనకు తాను ఇచ్చుకునే ఒక పవిత్రమైన మాట! కోపాన్ని జయిస్తానని చేసే ప్రతిజ్ఞ... అహంకారాన్ని విడిచిపెడతానని తీసుకునే నిర్ణయం.. చెడుకు దూరంగా ఉంటానని చేసుకునే సంకల్పం.. సాటి మనిషిలో దైవాన్ని చూస్తానని చాటిచెప్పే ఆచరణ!

మాల ధరించిన మరుక్షణం నుంచి భక్తుడి జీవనశైలిలో మార్పు మొదలవుతుంది. ఆహార నియమాలు, బ్రహ్మచర్యం, నిత్య పూజలు, భజనలు, సాత్విక జీవనం, సేవాభావం... ఇలా ప్రతి నియమం మనిషిని ఆత్మనిగ్రహం వైపు నడిపిస్తుంది.

అయ్యప్ప దీక్షలో కులం లేదు... ధనిక, పేద తేడా లేదు.. హోదాలకు స్థానం లేదు... అందరూ స్వాములే! ఒకరినొకరు స్వామి అని సంబోధించుకుంటూ సమానత్వానికి సరికొత్త నిర్వచనం చెబుతారు. ఇదే అయ్యప్ప తత్వంలోని గొప్ప మానవీయ సందేశం!

దీక్ష అంటే కష్టాలను భరించడం మాత్రమే కాదుడ మనలోని చెడును జయించడం!

నాలుగు గోడల మధ్య పూజ చేయడం భక్తి అయితే... నలుగురికి సాయం చేయడం కూడా భక్తే! గుడిలో దేవుడిని దర్శించడం ఆరాధన అయితే... ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం అంతకంటే గొప్ప ఆరాధన! నోటితో స్వామి నామం పలకడం శరణుఘోష అయితేడ చేతలతో ధర్మాన్ని ఆచరించడం నిజమైన అయ్యప్ప దీక్ష!

ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరే భక్తుడి అడుగుల్లో అలసట ఉండవచ్చుడ కానీ ఆలోచనల్లో మాత్రం అయ్యప్ప స్వామి దర్శనమే ఉంటుంది. పంబా నదిలో పవిత్ర స్నానం నుంచి పద్దెనిమిది పవిత్ర మెట్ల అధిరోహణ వరకు ప్రతి ఘట్టం భక్తుడికి ఓ అనుభూతి.. ఓ అనుభవం.. ఓ ఆత్మీయ ప్రయాణం!

కార్తీక మాసంలో వెలిగించే దీపం మన ఇంటికి వెలుగునిస్తే.. అయ్యప్ప దీక్ష మన జీవితానికి దిశానిర్దేశం చేస్తుంది. దీపం వెలుగు కళ్లకు కనిపిస్తుంది.. దీక్ష నేర్పిన క్రమశిక్షణ జీవితాంతం కనిపించాలి!

మనిషి మెడలో మాల ఉండటం కన్నా.. మనసులో మంచితనం ఉండటం ముఖ్యం. నోట అయ్యప్ప నామం ఉండటం కన్నా.. నడతలో అయ్యప్ప తత్వం కనిపించడం గొప్ప విషయం.

కార్తీకం నేర్పేది భక్తిడ అయ్యప్ప దీక్ష నేర్పేది క్రమశిక్షణ,,, శబరిమల యాత్ర నేర్పేది సహనం.. అయ్యప్ప తత్వం నేర్పేది సమానత్వం.. ఈ నాలుగూ మనిషి జీవితంలో కలిసినప్పుడే ఆధ్యాత్మికతకు అసలైన అర్థం!

దీపం వెలిగిద్దాం... మనసులను ప్రకాశింపజేద్దాం.. మాల ధరించుదాం.. మనలోని మలినాలను విడిచిపెడదాం.. స్వామిని కొలుద్దాం.. తోటి మనిషిలోనూ దైవాన్ని దర్శిద్దాం!



- స్వామియే శరణం అయ్యప్ప! రచన: ఆకుల రచన పర్వతగిరి విశ్వ జెనిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ టీచర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మృతి ఆర్థికసహాయం అందచేసిన సర్పంచ్ విక్రమ్



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 9:రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామం లోకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొళ్ళెపెల్లి రాములు ఆకస్మిక మృతిచేందడంతో వారి మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియచేసి 5000/-(ఐదు వేల రూపాయలు) ఆర్థికసహాయం అందచేసినతెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ సభ్యులు పుట్టల లక్ష్మమ్మ ముత్యాలు,మాజీ సర్పంచ్ కాటేపల్లి సిద్దమ్మ యాదయ్య,ఈర్లపల్లి మల్లయ్య, మందడి విద్యాసాగర్ రెడ్డి, సింగణబోయిన జంగయ్య,గర్ధాస్ కరుణాకర్, సింగణబోయిన మల్లేశం,మాజీ వార్డ్ సభ్యుడు నిమ్మగడ్డ పద్మారావ్,ఈర్లపల్లి రమేష్,గొల్లపల్లి యాదయ్య,నక్క వెంకటేష్,పాలసంఘము డైరెక్టర్ గర్ధాస్ వెంకటేష్,మంటి బిక్షపతి,బొల్ల నర్సింహా, చిన్నపాక సురేష్,మంటి బాబు,భువనగిరి మధు, వెలిమినేటి నరేష్,గర్ధాస్ సాయి,గడ్డం సాయి, గర్ధాస్ శ్రీకాంత్,పుట్టల సాయికుమార్, గర్ధాస్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

శ్రీనిధి నిధులు స్వాహా.. పర్యవేక్షణ ఏమైనట్లు?

రూ.28 లక్షలు సొంత అవసరాలకు.. వడ్డీతో కలిపి రూ.36.46 లక్షల బకాయిలు!

ఏడేళ్లుగా సాగిన ఆర్థిక లావాదేవీలు.. ఏపీఎం, సీసీలకు తెలియకుండానే జరిగాయా?

అధికారుల పర్యవేక్షణ ఉన్నా గుర్తించలేదా? బాధ్యత ఎవరిది?

బకాయిలు చెల్లించకుంటే ఆర్ఆర్ చట్టం కింద ఆస్తుల జప్తు..

గ్రామసభలో అగ్రిమెంట్



తొలి అక్షరం/ఏన్కూర్ నవంబర్ 9: మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతి కోసం కేటాయించిన శ్రీనిధి నిధులు పక్కదారి పట్టిన వ్యవహారం ఏన్కూరు మండల కేంద్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2019 నుంచి 2026 వరకు సుమారు రూ.28 లక్షల అసలు మొత్తాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడికాగా, వడ్డీతో కలిపి మొత్తం బకాయిలు రూ.36,46,303కు చేరినట్లు అధికారులు నిర్ధారించారు. అయితే ఏడేళ్లపాటు ఇంతటి భారీ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగినా సంబంధిత పర్యవేక్షణ వ్యవస్థకు ముందుగానే ఎందుకు తెలియలేదన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.**ఏపీఎం, సీసీల పర్యవేక్షణ ఏమైంది?**శ్రీనిధి రుణాల మంజూరు, వాటి వినియోగం, తిరిగి చెల్లింపులు, మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల పర్యవేక్షణలో మండల స్థాయి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు తదితర సిబ్బంది పాత్ర ఎంతవరకు ఉంది? గ్రామస్థాయిలో మహిళా సంఘాల కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన సిబ్బందికి ఈ లావాదేవీల గురించి తెలియదా? తెలిసినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదా? లేక క్షేత్రస్థాయి పర్యవేక్షణలో లోపాలు ఉన్నాయా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.2019 నుంచి 2026 వరకు జరిగిన లావాదేవీల్లో సుమారు రూ.28 లక్షలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై అప్పటి నుంచి ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన ఏపీఎంలు, సీసీలు, సంబంధిత సిబ్బంది పాత్రను కూడా సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వారి పర్యవేక్షణ నివేదికలు, తనిఖీ రికార్డులు, రుణాల పంపిణీ, వసూళ్ల వివరాలను పరిశీలిస్తేనే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.**అధికారులకు తెలియకుండానే ఏడేళ్ల వ్యవహారమా?** ఏన్కూరు గ్రామపంచాయతీ పరిధిలో 30 మహిళా సంఘాలు, 125 మంది సభ్యులు ఉన్నారు. ఇన్ని సంఘాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయే వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేసింది? నెలవారీగా లేదా కాలానుగుణంగా తనిఖీలు జరగలేదా? రుణాల వినియోగంపై క్షేత్రస్థాయి పరిశీలన జరిగిందా? బకాయిలు పెరుగుతున్న విషయాన్ని సంబంధిత అధికారులు గుర్తించలేదా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.ఈ వ్యవహారంపై ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, ఈపీఎం శ్యామ్ కుమార్, శ్రీనిధి మేనేజర్ చారి, ఆడిటర్లు భూమి, మీనా మూడు రోజులపాటు గ్రామంలో పర్యటించి సంబంధిత రికార్డులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి బకాయిల వివరాలను వెల్లడించారు. మొత్తం రూ.36,46,303 తిరిగి చెల్లించేందుకు సంబంధిత వ్యక్తులు అంగీకరిస్తూ అగ్రిమెంట్ రాసిచ్చినట్లు సమాచారం.నిర్ణీత షరతుల ప్రకారం బకాయిలు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం ప్రకారం సంబంధిత వ్యక్తుల స్థిర, చరాస్తులను జప్తు చేసి వేలం వేయడం ద్వారా బకాయిలను వసూలు చేయనున్నట్లు అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది.ఏన్కూరులో వెలుగుచూసిన ఈ వ్యవహారాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీనిధి లావాదేవీలపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే తనిఖీలు కేవలం బకాయిలను గుర్తించి వసూలు చేయడానికే పరిమితం కాకుండా, ఇంతకాలం పర్యవేక్షణలో ఉన్న లోపాలను కూడా బయటపెట్టాలి. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వ్యక్తులతో పాటు పర్యవేక్షణ బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది పాత్రపైనా విచారణ జరగాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగానికి గురైతే, దాని ప్రభావం నేరుగా పేద మహిళల ఆర్థిక పరిస్థితిపై పడుతుంది. రూ.36.46 లక్షల బకాయిలు ఎలా పేరుకుపోయాయి? ఏడేళ్లుగా జరిగిన లావాదేవీలను ఎవరు పర్యవేక్షించారు? ఏపీఎం, సీసీల తనిఖీ నివేదికల్లో ఈ అంశాలు ఎందుకు ప్రతిబింబించలేదు? సంబంధిత అధికారులకు ముందస్తుగా సమాచారం ఉందా? ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

శతాబ్దాల కల నెరవేరే దిశగా ధర్మారెడ్డి పెళ్లి కాలువ పనులు.. బోగారానికి త్వరలో సాగునీరు!



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 9:ఎన్నో రోజులుగా పెండింగ్ లో ఉన్న ధర్మారెడ్డి పెళ్లి కాలువ పనులు త్వరితగతిన పూర్తయ్యే దిశగా సాగుతున్నాయి. కొన్ని శతాబ్దాలుగా ఈ ప్రాంత రైతులు ఎదురుచూస్తున్న ఈ కాలువ పనులు పూర్తి కావడం వెనుక ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ ప్రభుత్వ విప్ వేముల వీరేశం కృషి, ఆదేశాలు ఉన్నాయి.వారి ప్రత్యేక చొరవతో మన మండలంలోని బోగారం గ్రామానికి కూడా ఈ కాలువ ద్వారా త్వరలో సాగునీరు అందే శుభసంకల్పం నెరవేరనుంది. ఈ విషయంలో ఎమ్మెల్యే నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఈరోజు కాంగ్రెస్ పార్టీ బోగారం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కాలువ పనులను పర్యవేక్షించడం, పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు గోగు హరిప్రసాద్ , మాజీ అధ్యక్షులు మధ్యపురి ఐలయ్య , కాంగ్రెస్ కో-ఆప్షన్, జిల్లా ఎస్సీ ఎస్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, డైరెక్టర్ గంపల జీవన్ రెడ్డి , మాజీ ఎంపీటీసీ గోగు సత్తయ్య, పద్మ తెలంగాణ ఉద్యమకారుడు ఉద్యమకారుల ఫోరం రామన్నపేట మండలం ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య తెలంగాణ ఉద్యమ నాయకులు ఎండి ఇమామ్ సాబ్ , గుంతకంట్ల గోవర్ధన్ రెడ్డి , గ్రామ కార్యదర్శి గోగు సురేష్ , వార్డు నెంబర్ రాపోలు తదితరులు పాల్గొన్నారు.కాలువ పనులు పూర్తైతే బోగారం గ్రామ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయం మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.


కొండ పెద్ద లింగయ్య గౌడ్ మృతి
- నివాళులర్పించిన దైద రవీందర్





తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 9:నకిరేకల్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కొండ యాదయ్య గౌడ్ తండ్రి కొండ పెద్ద లింగయ్య గౌడ్ మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన నివాసానికి వెళ్లి, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.పెద్ద లింగయ్య గౌడ్ ఎంతో మంచి మనసున్న వ్యక్తి అని, ఆయన మృతి కుటుంబానికి, గ్రామానికి తీరని లోటని దైద రవీందర్ అన్నారు. ఆ భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞాన్ కళాశాల డైరెక్టర్ కరుణాకర్ వినతి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 09: డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్) బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ కరుణాకర్ కోరారు. ఈ మేరకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను టీపీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కరుణాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ
- జమున జ్యూయలరీ షాపు యజమానులకు ధైర్యం చెప్పిన ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్



తొలిఅక్షరం /మరిపెడ నవంబర్ 9: ఇటీవల మరిపెడలో జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన జమున జ్యూయలరీ షాపును ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ సందర్శించారు. షాపు యజమానులు మౌర్య రాజేష్, మీనా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఆయన సతీమణి ప్రమీలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేట ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- అధ్యక్షుడిగా చౌదరపు శ్రీనివాస్.. ప్రధాన కార్యదర్శిగా రాంపల్లి రమేష్







తొలిఅక్షరం/నర్సింహులపేట నవంబర్ 9:నర్సింహులపేట ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో గౌరవ సలహాదారులుగా భూపతి కాశయ్య, అధ్యక్షుడిగా చౌదరపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కల్లెడ మధు, ఎర్ర వెంకట్‌రామ్ నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా రాంపల్లి రమేష్, కోశాధికారిగా జెట్టి యాకయ్య, సహాయ కార్యదర్శిగా భూక్య రవి, సోషల్ మీడియా బాధ్యుడిగా మొహమ్మద్ జాఫర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించి పలువురు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అందరినీ కలుపుకొని సమిష్టిగా పనిచేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

కాచం భిక్షమయ్యకి ఘన నివాళి – క్లాస్‌మేట్ సత్యమంగ నాన్న మృతికి సంతాపం



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 9:క్లాస్‌మేట్ సత్యమంగ నాన్న, కాచం భిక్షమయ్య మృతి పట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు మాట్లాడుతూ, భిక్షమయ్య ఎంతో మంచి మనసున్న వ్యక్తి అని, ఆయన సేవలు, మంచి జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంటాయని తెలిపారు. ఆయన మృతి కుటుంబానికి తీరని లోటని, ఆ భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ నివాళి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు పాల్గొని, రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

కొడంగల్ రైతు సభకు షాద్‌నగర్ కాంగ్రెస్ శ్రేణుల భారీ తరలింపు
- సీఎం రేవంత్ రెడ్డి సభకు కదిలిన షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- హకీంపేట రైతు సభలో షాద్‌నగర్ కాంగ్రెస్ నేతల సందడి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 09: కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా హకీంపేటలో సోమవారం నిర్వహించిన భారీ రైతు బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రావు, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి వేలాది మంది రైతులు హాజరయ్యారు. సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. పర్యటనలో భాగంగా లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో ఎకోపామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు నాచారం గ్రామం నుంచి రేడియల్ రోడ్డు-2 సహా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, బాబర్ ఖాన్, శివశంకర్ గౌడ్, విశ్వం, రఘు నాయక్, కృష్ణారెడ్డి, బాలరాజు గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెల్లంకిలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు





తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 9: రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా రేవంత్ రెడ్డి అభిమాన నాయకులు పోచబోయిన మల్లేష్ కురుమ మహేందర్ రాపోలు లింగస్వామి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటిసి తాళ్లపల్లి సత్తిరెడ్డి సింగిల్ విండో చైర్మన్ సంద్యాల భిక్షం రెడ్డి కర్రె రమేష్ పోచబోయిన నరసింహ ఎడ్ల సంజీవరెడ్డి నకిరేకంటి రవీందర్ ఎడ్ల సురేందర్ రెడ్డి నకిరేకంటి గణేష్ ఎడ్ల రామచంద్రారెడ్డి గోధుమల సోమప్ప కాట్రేరు నాగరాజు రావిటి రమేష్ గుడిసె ఉషయ్య పోచబోయిన ప్రశాంత్ రాపోలు మల్లేష్ రేవంత్ రెడ్డి అభిమాన నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

అనారోగ్యంతో ఉన్న కమలమ్మకు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శ
- పెద్దనాగారంలో మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలపై ఆరా



తొలిఅక్షరం/ నర్సింహులపేట నవంబర్ 9: మండలంలోని పెద్దనాగారం గ్రామ మాజీ సర్పంచ్ పులిచింతలవెంకట్ రెడ్డి సతీమణి కమలమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కమలమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమెకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము పుల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుజ్జి వీరాస్వామి, గాడుదుల కోమిరెల్లి, సప్పిడి జయపాల్‌రెడ్డి, వీరభద్రం, అమృతరెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు.. సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు





తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 9:రామన్నపేట మండలం కుంకుడుపాముల గ్రామంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నాతి పరుశురాం గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.గ్రామానికి మంజూరైన 25 ఇందిరమ్మ ఇళ్లలో నిర్మాణం పూర్తిచేసుకున్న 18 ఇళ్ల వద్ద ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి సంబరాలు జరిపారు. ఇళ్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ పార్టీకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామానికి మరో 20 ఇందిరమ్మ ఇళ్లు, రహదారి, విద్యుత్ స్తంభాలు, కొత్త పింఛన్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా దీపావళి వేడుకలు







తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 8:రామన్నపేటలోని పల్లవి మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చిన్నారులు చిచ్చుబుడ్లు వెలిగిస్తూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దీపావళి పండుగ విశిష్టతను వివరించి, సురక్షితంగా, కాలుష్యరహితంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కన్నెబోయిన శ్రీధర్, ప్రిన్సిపాల్ జిలు, వైస్ ప్రిన్సిపాల్ శివానితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవో 641 రద్దయ్యే వరకు ప్రజా ఉద్యమం ఆగదు

● మంత్రి ప్రకటనకు స్వాగతం.. రద్దుపై అధికారిక ప్రకటన చేయాలి



తొలి అక్షరం/కొత్తూరు, నవంబర్ 09: కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, అయితే జీవో 641 రద్దుపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్య మాట్లాడుతూ ప్రజల నిరంతర పోరాటం వల్లే మంత్రి ఈ ప్రకటన చేశారని, ఇది ప్రజా ఉద్యమ విజయమని పేర్కొన్నారు. గతంలోనూ హామీలు ఇచ్చి జీవో విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కేవలం మాటలతో ప్రజలను నమ్మించలేరని, జీవో 641ను ఎప్పుడు రద్దు చేస్తారో స్పష్టమైన గడువుతో ప్రకటించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే దీక్షా శిబిరానికి వచ్చి నెల లేదా రెండు నెలల్లో జీవో రద్దు చేయిస్తామని హామీ ఇస్తే ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. జీవో అధికారికంగా రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అబ్దుల్ రబ్ జామి, అర్జునప్ప, రవీంద్రనాథ్, ప్రశాంత్, రాజేందర్ రెడ్డి, శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ వేడుకలు

గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో సీఎం రేవంతన్న పుట్టినరోజు వేడుకలు





తొలి అక్షరం/నెల్లికుదురునవంబర్ 09: నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగ అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుపై భరోసా కల్పించే చిరునామా అని అన్నారు. దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతోనూ పండుగ సంతోషాన్ని పంచుకోవాలనే ఆత్మీయ ఉద్దేశంతో పట్టు వస్త్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ సూచనలతో ప్రజలకు మరింత చేరువగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ప్రజల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పల్లె రాధిక, గౌస్, కోరిశెట్టి వెంకన్న, మాట్లాడుతూ గత పదేళ్లుగా ఉండడానికి గూడు లేక పాములతో,తేళ్ల భారిన పడి ఎక్కడ ఎంవుతావేమో అనే భయం తో,ఎండకు ఎండకు ఎండుతూ,వానకు తడుస్తూ ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతూ రాత్రింబవళ్లు నరకయాతన చూసిన మాకు గత ఎలక్షన్స్ లో రేవంత రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం,శాసనసభ్యులు ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇందిరమ్మ ఇల్లు కట్టించి మేము సమాజం లో గౌరవంగా బ్రతికేలా చేశారని,ఇందిరమ్మ ఇంట్లో దీపావళి జరుపుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్, బండి శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ,వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల సతీష్, వార్డు మెంబర్ కొరిశెట్టి వెంకన్న, పల్లె రాధిక,గౌస్,పెరుమాండ్ల వెంకన్న, బండి శ్రీనివాస్, యాకబ్, కాశమల్ల వెంకన్న, భరత్, మల్లేపల్లి వెంకన్న, బాలు, వల్లేపు యాకయ్య, రఘుపతి, సుర వెంకన్న, దేవయ్య, పాశం వెంకన్న, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులపై బైండోవర్ చర్యలు సరికాదు

● పెన్షన్లు పెంచకుండా ప్రశ్నించే వారిని నిర్బంధిస్తారా? నోటీసులు ఎత్తివేయాలి: భుజంగారెడ్డి









తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) నాయకులు, కార్యకర్తలను పోలీసులు బైండోవర్ చేయడంపై ఆ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే బైండోవర్ నోటీసులను ఎత్తివేయాలని ఎన్‌పీఆర్‌డీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి డిమాండ్ చేశారు.వికలాంగుల పెన్షన్లు పెంచాలని ప్రశ్నించే నాయకులు, కార్యకర్తలపై నిర్బంధ చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన విమర్శించారు. నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం తగదన్నారు.గత మూడేళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరు కోసం ఎన్‌పీఆర్‌డీ పోరాటం చేస్తోందని, నవంబర్ 8న ప్రభుత్వం కొత్త పెన్షన్లపై ప్రకటన చేయడం తమ పోరాటాల ఫలితమని సంఘం నాయకులు పేర్కొన్నారు. సుమారు 50 లక్షల మంది కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, నాలుగు లక్షల మందికే పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేసి, అన్ని జిల్లాల్లో పంపిణీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

నిరుపేదల సొంతింటి కల నెరవేరిన దీపావళి

- ఇందిరమ్మ ఇళ్లలో పండుగ వేడుకలు.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్







తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 09: దశాబ్దాలుగా సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఈ దీపావళి ఎంతో ప్రత్యేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని 14వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అధికారుల నుంచి అందుతున్న సహకారాన్ని అడిగి తెలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ కాలం నుంచి నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, భవిష్యత్తులో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రైతు భరోసా, రుణమాఫీ, పంటలకు బోనస్, యువతకు ఉద్యోగాల కల్పన వంటి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన కుటుంబాలతో కలిసి దీపావళి జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.**సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇందిరమ్మ ఇంటి వద్ద మహేశ్‌కుమార్ గౌడ్ కేక్ కట్ చేశారు. మీడియా ద్వారా సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎన్నో సవాళ్లు ఎదురైనా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు మండల బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా సంగెం శివకుమార్

● నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహ



తొలి అక్షరం/కొత్తూరు, నవంబర్ 9: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కొత్తూరు మండల అధ్యక్షుడిగా సంగెం శివకుమార్ నియమితులయ్యారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తరించి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

- ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



తొలి అక్షరం/రంగారెడ్డి, నవంబర్ 08: ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అధికారులు ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 26 ఫిర్యాదులు అందగా, రెవెన్యూ శాఖకు సంబంధించి 19, ఇతర శాఖలకు సంబంధించి 7 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎల్ఎం పథకం అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- 40 ప్రాజెక్టుల్లో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఏఐఎఫ్‌బీ ఫిర్యాదు



తొలి అక్షరం/కరీంనగర్, నవంబర్ 9: జిల్లాలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకం అమలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, కమిటీ సభ్యుడు బద్రి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.జిల్లాలో సుమారు 40 ప్రాజెక్టులకు కేటాయించిన ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణాల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని శేఖర్ తెలిపారు. నిర్మాణాలు చేపట్టకుండా నే షెడ్లు ఉన్నట్లు చూపించడం, పాత షెడ్లను కొత్తవిగా పేర్కొనడం, పశువులు, కోళ్లు లేకున్నా ఉన్నట్లు తప్పుడు నివేదికలు సమర్పించారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.పశుసంవర్ధక శాఖ, బ్యాంకు అధికారుల పాత్రపై విచారణ జరిపి, ప్రాజెక్టుల క్షేత్రస్థాయి తనిఖీలు, నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే నిధులను రికవరీ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బండారి శేఖర్ డిమాండ్ చేశారు.

సంపాదకీయం

రేవంత్ నాయకత్వంలో తెలంగాణ రైజింగ్

● యువతకు కొత్త అవకాశాలు.. రైతులు, కార్మికుల జీవితాల్లో మార్పే అసలైన అభివృద్ధి



హైదరాబాద్, నవంబర్ 9:ఓటములతో కుంగిపోకుండా పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం చాటిచెబుతోంది. కొడంగల్‌లో ఓటమి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణం ఎన్నో రాజకీయ మలుపులకు సాక్ష్యంగా నిలిచింది. జెడ్పీటీసీ సభ్యుడిగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ పదవులను దాటి ముఖ్యమంత్రి పీఠం వరకు చేరింది. ప్రతి దశలోనూ ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగడం ఆయన రాజకీయ జీవితంలో ప్రత్యేకతగా నిలిచింది. 2018లో కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన రేవంత్‌రెడ్డి, 2019లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిపోయినా, కొడంగల్‌లో గెలుపొందారు. ఈ పరిణామాలు రాజకీయాల్లో ఓటమి అంతిమం కాదని, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాన్ని సాధించవచ్చని నిరూపించాయి. రైతు కుటుంబంలో జన్మించి, హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ విద్యను అభ్యసించిన రేవంత్‌రెడ్డి చిన్ననాటి నుంచే రాజకీయాల్లో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకున్నట్లు ఆయన సన్నిహితులు గుర్తుచేస్తుంటారు.**యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం**దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో యువతకు మరింత భాగస్వామ్యం కల్పించాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ప్రస్తుతం 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించినప్పుడు, 21 ఏళ్లకే శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు కల్పించకూడదనే ప్రశ్న ముందుకు వస్తోంది. ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలనే ప్రతిపాదనపై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలనే ఆలోచన చర్చకు వచ్చింది. అయితే వయోపరిమితిని మార్చాలంటే రాజ్యాంగ, చట్టపరమైన సవరణలు అవసరం. ఈ అంశంలో యువత అభిప్రాయాలకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం కల్పించడం కీలక పరిణామం.యువత కేవలం రాజకీయ సభల్లో నినాదాలు చేసే వారిగా కాకుండా విధాన నిర్ణయాల్లో భాగస్వాములుగా ఎదగాలి. విద్య, ఉపాధి, క్రీడలు, నాయకత్వ రంగాల్లో వారికి తగిన అవకాశాలు కల్పించినప్పుడే యువ భారతం లక్ష్యం సాకారమవుతుంది.**విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం**యంగ్ ఇండియా పాఠశాలలు, నైపుణ్య విశ్వవిద్యాలయం, క్రీడా విశ్వవిద్యాలయం వంటి కార్యక్రమాలు తెలంగాణ భవిష్యత్తుకు ఉపయోగపడేలా రూపుదిద్దుకోవాలి. విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ విద్య, పోషకాహారం అందించడంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలి. కేవలం డిగ్రీలు పొందడం కాకుండా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సంపాదించినప్పుడే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు సరైన శిక్షణ, మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించాలి.**సాంకేతిక రంగంలో తెలంగాణకు కొత్త అవకాశాలు**కృత్రిమ మేధస్సు, జీవశాస్త్ర ఆధారిత పరిశ్రమలు, ఆధునిక సాంకేతిక రంగాలు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు తెలంగాణకు కొత్త అవకాశాలను అందించగలవు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలి. హైదరాబాద్ అభివృద్ధితోపాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ వంటి నగరాలను కూడా పారిశ్రామిక, విద్యా, ఉపాధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.అభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. సామాన్య ప్రజల ఆదాయం పెరగడం, రైతులకు గిట్టుబాటు ధర లభించడం, కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు అందడం, యువతకు స్థానికంగానే ఉద్యోగాలు కల్పించడం కూడా అభివృద్ధిలో భాగమే. వ్యవసాయానికి నీటి వసతి, పంటల నిల్వ, మార్కెటింగ్, ప్రాసెసింగ్ సదుపాయాలను మెరుగుపరచాలి.**సంక్షేమ పథకాల అమలే అసలైన పరీక్ష**రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందాలి. పథకాలను ప్రకటించడం ఎంత ముఖ్యమో, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం అంతకంటే ముఖ్యం. నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలు, మెరుగైన వైద్య సేవలు, స్థిరమైన ఉపాధి, ఆదాయం పెంచే వ్యవసాయ విధానాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.ప్రభుత్వం ప్రకటించే ప్రతి కార్యక్రమానికి స్పష్టమైన కాలపరిమితి ఉండాలి. అమలులో జాప్యం జరిగితే బాధ్యత వహించే వ్యవస్థ ఉండాలి. ప్రజలకు కనిపించే ఫలితాలే ప్రభుత్వ పనితీరుకు నిజమైన కొలమానం. ప్రచారానికి, ఆచరణకు మధ్య అంతరం లేకుండా పాలన సాగినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.**2047 తెలంగాణ లక్ష్యం**తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం రైతులు, కార్మికులు, యువత, పారిశ్రామికవేత్తలు అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. సాంకేతిక అభివృద్ధితోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రగతికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. హైదరాబాద్ ఒక్కటే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి. రైతుకు భరోసా, కార్మికుడికి గౌరవం, యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలి.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని ఆశిద్దాం. యువతకు కొత్త అవకాశాలు కల్పించడం, రైతుల ఆదాయం పెంచడం, కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకురావడం, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి నిజమైన అర్థం చేకూరుతుంది. నాయకుడి విజయం కేవలం రాజకీయ పదవులతో కొలవబడదు. ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పుతోనే ఆయన నాయకత్వానికి సార్థకత లభిస్తుంది.

అరాచక శక్తిమంతులు!


మీడియా సర్వేలతో నాయకుల ప్రభావాన్ని అంచనా వేయగలమా?



న్యూఢిల్లీ, నవంబర్ 9:దేశంలో అత్యంత శక్తిమంతమైన నాయకుల జాబితా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మొదటి స్థానం, ఆర్ఎస్ఎస్ ముఖ్యనేత మోహన్ భగవత్‌కు రెండో స్థానం, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మూడో స్థానం, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి నాలుగో స్థానం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఐదో స్థానం లభించాయి. ఈ జాబితాను ఆ మీడియా సంస్థ రోజంతా ప్రముఖంగా ప్రచారం చేసింది. అయితే నాయకుల శక్తి, ప్రజల్లో వారి ప్రభావం, ప్రజాస్వామ్య వ్యవస్థలో వారి పాత్రను కేవలం మీడియా సర్వేల ఆధారంగా నిర్ణయించగలమా అన్న ప్రశ్నను ఈ పరిణామం ముందుకు తెచ్చింది.ఇటీవల సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ షీలా సింగ్ విడుదల చేసిన ఓ వీడియో కూడా చర్చకు దారితీసింది. బీజేపీకి సంబంధించిన ఓ సమావేశంలో జాతీయ మీడియాకు చెందిన కొందరు ప్రముఖ యాంకర్లు పాల్గొన్నట్లు కనిపిస్తున్న ఆ వీడియోలో మోదీకి అనుకూలంగా నినాదాలు వినిపించాయి. అయితే ఆ వీడియోకు, జాతీయ మీడియా సంస్థ ప్రకటించిన నాయకుల జాబితాకు సంబంధం లేదని సంపాదకీయం స్పష్టం చేసింది. అయినప్పటికీ మీడియా సంస్థల తీరుపై చర్చించాల్సిన అవసరాన్ని ఈ రెండు పరిణామాలు గుర్తుచేస్తున్నాయి.ప్రస్తుతం దేశంలో అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వ నిర్ణయాలను ప్రశంసించడంలో ముందుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా ప్రధాన బాధ్యత. కానీ అధికారంలో ఉన్నవారిని నిరంతరం గొప్పగా చూపించడం, ప్రతిపక్షాల విమర్శలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి ధోరణులు ప్రజాస్వామ్యానికి ఎంతవరకు ఉపయోగపడతాయన్నది ఆలోచించాల్సిన అంశం.ఇటీవల యువతలోని కొన్ని వర్గాలు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత వంటి అంశాలపై ఉద్యమాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు పెరుగుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాంటి సమయంలో నాయకుల ప్రభావాన్ని పెంచి చూపించే సర్వేలకంటే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడం ముఖ్యమనే వాదన వినిపిస్తోంది.ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మొత్తం 28 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీలు పోటీ చేశాయి. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ ప్రతిపక్షాల రాజకీయ భవిష్యత్తుపై వ్యాఖ్యలు చేశారు. పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించినా ప్రతిపక్షాలకు గెలిచే అవకాశం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాల్లోనూ పోటీ చేయలేదు. ఉత్తరప్రదేశ్‌లోనూ ఆ పార్టీ బరిలోకి దిగలేదు. అందువల్ల మొత్తం ఫలితాలను ఒకే పార్టీ బలానికి కొలమానంగా చూడటం సరికాదనే అభిప్రాయం ఉంది.కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ నాలుగు స్థానాల్లోనూ ఓటమి పాలవడం ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ కొన్ని స్థానాలను గెలుచుకున్నప్పటికీ వారణాసి ఉపాధ్యాయ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ విజయం సాధించింది. బీహార్‌లో దర్భంగా స్థానం జనసురాజ్ పార్టీకి దక్కింది. ఈ ఫలితాలు ప్రాంతాలవారీగా ఓటర్ల అభిప్రాయాల్లో భిన్నత్వాన్ని తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గోవిందరావు వంజరి వరుసగా రెండోసారి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీకి బలమైన ప్రాంతంగా పేరున్న నాగ్‌పూర్‌లో ప్రతిపక్షం విజయం సాధించడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఈ ఫలితంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గతంలో చేసిన వ్యాఖ్యలు, అనంతరం వాటిని తొలగించడం కూడా చర్చనీయాంశమయ్యాయి. ఒక ప్రాంతంలో వచ్చిన ఫలితాన్ని బట్టి దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితిని అంచనా వేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి.ఇక కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌లో నిర్వహించిన పాదయాత్రలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అరాచకత్వాన్ని అరికట్టాలని నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతే. అయితే కేంద్ర హోంమంత్రిగా దేశంలో శాంతిభద్రతలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు సంబంధించిన బాధ్యతలు ఆయనపై కూడా ఉన్నాయి. ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం, నిరసన తెలిపే హక్కును గౌరవించడం ప్రభుత్వాల బాధ్యతగా ఉండాలి.ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్నాయని ప్రతిపక్షాలు ఆరోపించిన పరిణామాలు కూడా సంపాదకీయంలో ప్రస్తావించబడ్డాయి. నామినేషన్ల దాఖలుకు అడ్డంకులు సృష్టించడం, అభ్యర్థులను బెదిరించడం, దాడులకు పాల్పడటం, పోలీసు వ్యవస్థను అధికార పక్షం అనుకూలంగా ఉపయోగించుకోవడం వంటి ఆరోపణలు ప్రజాస్వామ్య ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రతిపక్షాల పేరుతో నామినేషన్లు దాఖలు చేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ అంశాలపై వచ్చిన విమర్శలకు సంబంధించి సమగ్ర విచారణ, నిష్పక్షపాత చర్యలు అవసరం. ఇదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ద్వేషానికి బదులుగా ప్రేమను పంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు చోరీ ఆరోపణలపై ప్రతిపక్షాలు నిర్వహించిన ఈ సభలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం, సంబంధిత సంస్థలు వాస్తవాల ఆధారంగా సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.దేశంలో ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలి. అధికారంలో ఉన్నవారు విమర్శలను స్వీకరించాలి. ప్రతిపక్షాలు కూడా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాడాలి. మీడియా సంస్థలు ఏ రాజకీయ పక్షానికీ కొమ్ముకాయకుండా వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ప్రజల అభిప్రాయాలు, ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే నాయకుల ప్రభావాన్ని అంచనా వేయడానికి ప్రామాణికంగా ఉండాలి.నాయకులను శక్తిమంతులుగా ప్రకటించే సర్వేలకంటే ప్రజల జీవితాల్లో వారు తీసుకొచ్చిన మార్పులు, ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల వారి నిబద్ధత, ప్రజల హక్కుల పరిరక్షణకు చేసిన కృషి ముఖ్యమైనవి. అధికారాన్ని ప్రజాసేవకు ఉపయోగిస్తున్నారా? ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తున్నారా? ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరికినప్పుడే నాయకత్వం యొక్క నిజమైన ప్రభావాన్ని అర్థం చేసుకోగలం.

శత వసంతాల దిశగా అద్వానీ ప్రస్థానం

- భారత రాజకీయాల్లో చెరగని ముద్ర.. జనసంఘ్ నుంచి బీజేపీ ఎదుగుదల వరకు కీలక పాత్ర



న్యూఢిల్లీ, నవంబర్ 9:భారత రాజకీయ చరిత్రలో కొన్ని వ్యక్తుల ప్రస్థానం ఒక పార్టీకి మాత్రమే పరిమితం కాదు. దేశ రాజకీయ పరిణామాలతో ముడిపడి ఉంటుంది. అలాంటి అరుదైన నాయకుల్లో భారతరత్న, మాజీ ఉపప్రధాని లాల్‌కృష్ణ అద్వానీ ఒకరు. 1927 నవంబర్ 8న జన్మించిన ఆయన ఆదివారం 99వ జన్మదినం జరుపుకుని వందో ఏట అడుగుపెట్టారు. దాదాపు ఏడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు.**విభజన విషాదం నుంచి రాజకీయ ప్రస్థానం**కరాచీలో జన్మించిన అద్వానీ 1947లో దేశ విభజన సమయంలో తన స్వస్థలాన్ని విడిచిపెట్టి భారత్‌కు రావాల్సి వచ్చింది. చిన్న వయసులోనే ఎదురైన ఈ అనుభవం ఆయన జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. కొత్త జీవితాన్ని ప్రారంభించి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. జనసంఘ్ బలోపేతానికి కృషి చేస్తూ సంస్థాగత నిర్మాణంలో కీలక బాధ్యతలు చేపట్టారు. అనంతరం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం, విస్తరణలో ముఖ్యమైన పాత్ర పోషించారు.**వాజ్‌పేయితో సుదీర్ఘ అనుబంధం**అద్వానీ రాజకీయ జీవితంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయితో ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. విభిన్న వ్యక్తిత్వాలు, ఆలోచనా విధానాలు ఉన్నప్పటికీ ఇద్దరూ దశాబ్దాల పాటు కలిసి పనిచేశారు. పార్టీ నిర్మాణం, ఎన్నికల వ్యూహాలు, పార్లమెంటరీ రాజకీయాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగారు. ఒకరితో మరొకరు పోటీ పడకుండా పార్టీ అభివృద్ధి కోసం పనిచేయడం భారత రాజకీయాల్లో ప్రత్యేకంగా చెప్పుకోదగిన అంశం.**రథయాత్రతో జాతీయ రాజకీయాల్లో కీలక మలుపు**1990లో సోమనాథ్ నుంచి అయోధ్య వరకు అద్వానీ చేపట్టిన రథయాత్ర ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలక ఘట్టంగా నిలిచింది. రామజన్మభూమి ఉద్యమానికి దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం లభించింది. ఈ యాత్ర భారత రాజకీయాలపై, ముఖ్యంగా బీజేపీ ఎదుగుదలపై గణనీయమైన ప్రభావం చూపింది. ఈ పరిణామాలు దేశంలో రాజకీయ చర్చలను, సామాజిక సంబంధాలను కూడా ప్రభావితం చేశాయి. రథయాత్ర సందర్భంగా బీహార్‌లో ఆయన అరెస్టు కావడం అప్పట్లో దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టించింది.**ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యం కోసం పోరాటం**1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అద్వానీ ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడారు. జైలు జీవితాన్ని అనుభవించారు. ఎమర్జెన్సీ కాలంలో ఎదురైన అనుభవాలను తన రచనల్లోనూ ప్రస్తావించారు. 1977లో జనతా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్షుడిగా, కేంద్ర హోంమంత్రిగా, ఉపప్రధానిగా దేశ రాజకీయ, పరిపాలనా వ్యవస్థలో కీలక బాధ్యతలు చేపట్టారు.**బీజేపీ ఎదుగుదలలో కీలక పాత్ర**అద్వానీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించింది. 1989 ఎన్నికల నుంచి 1996లో అతిపెద్ద పార్టీగా అవతరించే వరకు బీజేపీ రాజకీయ ఎదుగుదలలో ఆయన పాత్ర ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీకి బలమైన సంస్థాగత పునాదులు ఏర్పాటు చేయడం, కార్యకర్తలను తీర్చిదిద్దడం, దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం వంటి అంశాల్లో ఆయన కృషి గుర్తించదగినది.**మోదీ ప్రశంసలు.. గురువుకు ఘన నివాళి**అద్వానీ వందో ఏట అడుగుపెట్టిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అద్వానీ రాజకీయ జీవితాన్ని, దేశానికి చేసిన సేవలను గుర్తుచేస్తూ ప్రత్యేక వ్యాసాన్ని కూడా రాశారు. అద్వానీలో సిద్ధాంత స్పష్టత, మేధోపరమైన పదును తనను ఎప్పుడూ ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. వాజ్‌పేయి, అద్వానీ కలిసి భారత రాజకీయాల గమనాన్ని మార్చారని అభిప్రాయపడ్డారు.**వ్యక్తిగత జీవితంలోనూ ప్రత్యేకత**రాజకీయ బాధ్యతలతో పాటు పుస్తక పఠనం, చరిత్ర, సినిమా, నాటక రంగాలపై అద్వానీకి ప్రత్యేక ఆసక్తి ఉండేది. ఆయన రాసిన మై కంట్రీ మై లైఫ్ పుస్తకం రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన అనేక అంశాలను వివరిస్తుంది. సింధీ సంస్కృతితో అనుబంధాన్ని కొనసాగిస్తూ లేహ్ సమీపంలో సింధు దర్శన్ కార్యక్రమం ప్రాచుర్యానికి కూడా కృషి చేశారు. ఆయన సుదీర్ఘ ప్రజా జీవితంలో భార్య కమలా అద్వానీ అందించిన సహకారం మరువలేనిది. 2024లో భారత ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ప్రదానం చేసింది. జనసంఘ్ నుంచి బీజేపీ ఎదుగుదల వరకు, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం నుంచి కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతల వరకు అద్వానీ జీవితం భారత రాజకీయ చరిత్రలో అనేక మలుపులకు సాక్ష్యంగా నిలిచింది. ఆయన శత వసంతాల ప్రస్థానం రాజకీయాల్లో దీర్ఘకాలిక కృషి, సంస్థాగత నిర్మాణం, పట్టుదలకు ఒక ఉదాహరణగా నిలుస్తోంది

దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళల జట్టు ప్రకటన



మూడు ఫార్మాట్లకు సారథిగా స్మృతి మంధాన..

జట్టులో జెమీమా రోడ్రిగ్స్‌కు చోటు

న్యూఢిల్లీ, నవంబర్ 9:దక్షిణాఫ్రికా పర్యటనలో తలపడనున్న భారత మహిళల క్రికెట్ జట్లను బీసీసీఐ ప్రకటించింది. డిసెంబర్‌లో జరగనున్న ఈ పర్యటనలో టెస్టు, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లకు స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ పర్యటనలో భారత జట్టు ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది.గతంలో టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టని స్మృతి మంధానకు ఈ పర్యటనతో ఆ అవకాశం లభించింది. టెస్టు, వన్డే జట్లకు దీప్తి శర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. టీ20 జట్టుకు షఫాలీ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది.మోకాలి గాయం నుంచి కోలుకుని తిరిగి క్రికెట్‌లోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌కు మూడు ఫార్మాట్ల జట్లలోనూ చోటు దక్కింది. గాయంతో కొంతకాలంగా జట్టుకు దూరమైన అమన్‌జోత్ కౌర్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చింది. హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, యాస్తికా భాటియా, హర్లీన్ డియోల్ తదితరులకు కూడా అవకాశం కల్పించారు.టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్, జి. కమలిని, అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలి సత్ఘరే.పర్యటన షెడ్యూల్: డిసెంబర్ 9న గ్కెబెర్హాలో ఏకైక టెస్టు మ్యాచ్‌తో పర్యటన ప్రారంభమవుతుంది. డిసెంబర్ 16న పార్లలో తొలి వన్డే, 19న కేప్‌టౌన్‌లో రెండో వన్డే, 22న బ్లూమ్‌ఫోంటెయిన్‌లో మూడో వన్డే జరుగుతాయి. డిసెంబర్ 26న బెనోనిలో తొలి టీ20, 29, 30 తేదీల్లో పోట్చెఫ్‌స్ట్రూమ్‌లో చివరి రెండు టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటేందుకు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. ఈ పర్యటనలో స్మృతి మంధాన నాయకత్వం, జెమీమా పునరాగమ నం, యువ క్రీడాకారిణుల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

ముంబైకి అర్ష్‌దీప్.. పంజాబ్‌కు హార్దిక్!



ఐపీఎల్‌లో సంచలన ఆటగాళ్ల మార్పిడి..

ముంబైకి లాభమంటున్న అభినవ్ ముకుంద్

న్యూఢిల్లీ, నవంబర్ 9:ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య కీలక ఆటగాళ్ల మార్పిడి చర్చనీయాంశంగా మారింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్లనుండగా, భారత ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు మారనున్నాడు. ఈ ఒప్పందంపై రెండు ఫ్రాంచైజీలు అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. అయితే బీసీసీఐ అధికారిక ఆమోదం, ఇతర ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఈ మార్పిడి ఖరారు కానుంది.**ముంబైకే ఎక్కువ ప్రయోజనం!**మాజీ భారత క్రికెటర్ అభినవ్ ముకుంద్ ఈ ఆటగాళ్ల మార్పిడిపై స్పందిస్తూ ముంబై ఇండియన్స్‌కే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డాడు. పంజాబ్ జట్టు అర్ష్‌దీప్, శ్రేయస్ అయ్యర్, యుజ్వేంద్ర చాహల్ వంటి కీలక ఆటగాళ్లపై పెట్టుబడి పెట్టిందని గుర్తుచేశాడు. ఇప్పుడు అర్ష్‌దీప్‌ను వదులుకుని హార్దిక్‌ను తీసుకోవడం జట్టు కూర్పుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నాడు.**శ్రేయస్ నాయకత్వంలో హార్దిక్ ఎలా?**పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కొనసాగనున్న నేపథ్యంలో ఆయన నాయకత్వంలో హార్దిక్ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారిందని ముకుంద్ ప్రశ్నించాడు. హార్దిక్ జట్టులో ఆల్‌రౌండర్‌గా మాత్రమే కొనసాగుతాడా? జట్టు సమతుల్యత ఎలా ఉంటుంది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్నాడు. హార్దిక్ రాకతో పంజాబ్ జట్టులో ఇప్పటికే ఉన్న మార్కస్ స్టోయినిస్ భవిష్యత్తుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాడు.**అర్ష్‌దీప్‌తో బుమ్రాకు జోడీ**అర్ష్‌దీప్ ముంబై ఇండియన్స్‌లో చేరితే జస్ప్రీత్ బుమ్రాతో కలిసి బలమైన పేస్ దళాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. పవర్‌ప్లేలో వికెట్లు తీయడంతో పాటు చివరి ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అర్ష్‌దీప్‌కు ఉంది. మరోవైపు అర్ష్‌దీప్‌ను వదులుకోవడం పంజాబ్ బౌలింగ్ విభాగాన్ని బలహీనపరచవచ్చని మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు.ఈ మార్పిడి జరిగితే పంజాబ్ జట్టులో యువ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్జేకు అవకాశాలు తగ్గుతాయా అన్న సందేహాన్ని కూడా అభినవ్ ముకుంద్ వ్యక్తం చేశాడు. మొత్తానికి ఐపీఎల్ వేలానికి ముందు ఈ ఆటగాళ్ల మార్పిడి రెండు జట్ల కూర్పులో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందోనని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

భారత పేసర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల

యువ బౌలర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు

పరిస్థితులను చక్కగా ఉపయోగించుకుంటున్న భారత బౌలర్లు..

బ్యాటర్లకు సవాల్‌గా మారిన పేస్ దళం



హామిల్టన్, నవంబర్ 9:న్యూజిలాండ్ పర్యటనలో భారత యువ ఫాస్ట్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. తమ పదునైన బంతులు, కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో కివీస్ బ్యాటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భారత పేసర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు కురిపించాడు. భారత బౌలర్లు తమ బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వడం లేదని, బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పరిస్థితులను అద్భుతంగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నాడు.అర్ష్‌దీప్ సింగ్, జొకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి యువ బౌలర్లు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపాడు. తొలి రెండు వన్డేల్లో న్యూజిలాండ్ కోల్పోయిన 20 వికెట్లలో 17 వికెట్లను భారత పేసర్లు పడగొట్టడం వారి ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆక్లాండ్, వెల్లింగ్టన్ వేదికలుగా జరిగిన మ్యాచ్‌ల్లో కివీస్ బ్యాటింగ్ విభాగం పూర్తిగా తడబడింది. తొలి మ్యాచ్‌లో 185 పరుగులకు, రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే ఆలౌట్ కావడం భారత బౌలింగ్ బలాన్ని తెలియజేస్తోంది.**పిచ్‌లను సమర్థంగా వినియోగించుకుంటూ..**న్యూజిలాండ్ పరిస్థితుల్లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్నప్పుడు భారత బౌలర్లు దానిని చక్కగా ఉపయోగించుకుంటున్నారని రోంచి వివరించాడు. ముఖ్యంగా తొలి ఓవర్లలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచుతున్నారని పేర్కొన్నాడు. బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేస్తూ బ్యాటర్లను తప్పులు చేసేలా చేస్తున్నారని తెలిపాడు. భారత పేసర్లు కేవలం వేగంపైనే ఆధారపడకుండా బంతి కదలికలను కూడా సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించాడు.భారత జట్టులో యువ బౌలర్లకు లభిస్తున్న అవకాశాలు, వారు చూపుతున్న ప్రతిభ జట్టుకు భవిష్యత్తులో మరింత బలాన్ని అందించనున్నాయి. సీనియర్ బౌలర్లతో పాటు యువ పేసర్లు కూడా కీలక సమయాల్లో వికెట్లు తీస్తుండటం భారత జట్టు బౌలింగ్ విభాగానికి సానుకూల అంశంగా మారింది.**బ్యాటర్లు సంయమనంతో ఆడాలి**మరోవైపు తమ బ్యాటర్లు కూడా పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉందని రోంచి సూచించాడు. ప్రతి మ్యాచ్‌లో భారీ స్కోర్లు సాధించాలనే ఆలోచనతో బరిలోకి దిగడం సరైన విధానం కాదన్నాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రత్యర్థి బౌలర్లకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలని పేర్కొన్నాడు. బంతి స్వింగ్ అవుతున్నప్పుడు ఆచితూచి ఆడటం, క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పరుగుల వేగాన్ని పెంచడం ముఖ్యమని వివరించాడు.తొలి ఓవర్లలో వికెట్లు కోల్పోతే మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెరుగుతుందని, అందువల్ల ఆరంభంలో వికెట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించాడు. భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు బ్యాటింగ్ విభాగం కొత్త వ్యూహాలతో సిద్ధం కావాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు.

బాల్ ట్యాంపరింగ్ వివాదంలో కొత్త మలుపు!

- **ఉస్మాన్ ఖవాజాకు డేవిడ్ వార్నర్ మద్దతు.. ఎనిమిదేళ్ల తర్వాత బయటపడుతున్న సంచలన విషయాలు**

సిడ్నీ, నవంబర్ 9:ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో చోటుచేసుకున్న శాండ్‌పేపర్ వివాదంపై మాజీ ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు మరో మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ మద్దతు ప్రకటించాడు. ఖవాజా వెల్లడించిన విషయాలు నూటికి నూరు శాతం నిజమని స్పష్టం చేశాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణ హడావుడిగా, లోపభూయిష్టంగా జరిగిందని విమర్శించాడు.**అసలు ఏం జరిగింది?**2018లో దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాడు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర సంచలనం సృష్టించింది. విచారణ అనంతరం డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన చర్యలు తీసుకుంది. వార్నర్, స్మిత్‌లకు ఏడాది పాటు నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించారు. వార్నర్‌పై నాయకత్వ బాధ్యతలు చేపట్టకుండా శాశ్వత నిషేధం కూడా విధించారు. అనంతరం 2024లో ఆయనపై ఆ నాయకత్వ నిషేధాన్ని తొలగించారు.**జట్టంతటికీ తెలుసు: ఖవాజా**తాజాగా తన ఆత్మకథ 'సర్వ్'లోని కొన్ని విషయాలను వెల్లడించిన ఉస్మాన్ ఖవాజా ఈ వివాదంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం గురించి జట్టులోని బ్యాటర్లు, బౌలర్లు, సహాయక సిబ్బంది సహా అందరికీ తెలుసునని పేర్కొన్నాడు. ఇది కేవలం ముగ్గురు ఆటగాళ్లకు సంబంధించిన వ్యవహారం కాదని, జట్టులోని పలువురికి ఈ విషయం తెలిసి ఉందని వెల్లడించాడు. ఈ ఘటనపై అప్పట్లో జరిగిన విచారణలో తనను ప్రశ్నించలేదని కూడా ఆరోపించాడు.తాను కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉన్నప్పటికీ విచారణలో తన వాంగ్మూలాన్ని తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఖవాజా పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు బయటకు రావాలని, ముగ్గురు ఆటగాళ్లపైనే మొత్తం బాధ్యతను మోపడం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు.**వార్నర్ ఏమన్నాడంటే..**ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన డేవిడ్ వార్నర్ సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశాడు. తన చిన్ననాటి స్నేహితుడైన ఖవాజాకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ఆయన వెల్లడించిన విషయాలు పూర్తిగా నిజమని పేర్కొన్నాడు. ఎనిమిదేళ్లుగా ఈ అంశంపై తాను బహిరంగంగా మాట్లాడలేదని, ఇప్పుడు నిజాలు బయటకు రావాల్సిన సమయం వచ్చిందని తెలిపాడు.ఖవాజా విచారణలో భాగంగా వాంగ్మూలం ఇవ్వకపోవడాన్ని వార్నర్ ప్రశ్నించాడు. అసలు ఆయనను విచారించకుండా జరిగిన ప్రక్రియను సమగ్ర విచారణగా ఎలా పరిగణిస్తారని నిలదీశాడు. అప్పట్లో జరిగిన విచారణ తొందరపాటుతో, సరైన పద్ధతిలో సాగలేదని విమర్శించాడు. ఈ వ్యవహారంలో ఎవరినీ నిందించడం తమ ఉద్దేశం కాదని, వాస్తవాలు వెలుగులోకి రావడం, పారదర్శకత, బాధ్యతాయుతమైన విచారణ జరగడమే ముఖ్యమని పేర్కొన్నాడు.**క్రికెట్ ఆస్ట్రేలియా సమాధానం**మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం గతంలో నిర్వహించిన విచారణపై తన వైఖరిని సమర్థించుకుంది. అప్పట్లో అందుబాటులోకి వచ్చిన సంబంధిత సమాచారాన్ని పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపింది. తమ విచారణలో వెల్లడైన అంశాలపై ఇప్పటికీ విశ్వాసం ఉందని స్పష్టం చేసింది. కొత్తగా ఏవైనా సంబంధిత ఆధారాలు అందిస్తే వాటిని పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.అప్పటి ఆస్ట్రేలియా కోచ్ డారెన్ లెమన్ కూడా ఖవాజా వ్యాఖ్యలతో విభేదించాడు. జట్టులోని ప్రతి ఒక్కరికీ ఈ వ్యవహారం గురించి తెలుసని తాను భావించడం లేదని పేర్కొన్నాడు. మరోవైపు అప్పటి ఆస్ట్రేలియా బౌలర్లు పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, నాథన్ లయన్ 2021లో విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ ప్రణాళిక గురించి తమకు తెలియదని స్పష్టం చేశారు.

కోహ్లీ ఔటవడంతో గిల్‌కు తప్పిన చిక్కు!

- గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు



స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేసి ఔటైన విషయం తెలిసిందే. దీనిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ సెంచరీకి చేరువలో ఉండి ఉంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనేవారని అభిప్రాయపడ్డారు.కోహ్లీ 90లలో ఉండి ఉంటే జట్టు విజయానికి వేగంగా పరుగులు చేయాలా? లేక అతడికి సెంచరీ అవకాశం కల్పించాలా? అనే సందిగ్ధం ఇద్దరికీ ఎదురయ్యేదని గావస్కర్ పేర్కొన్నారు. వేగంగా ఆడి మ్యాచ్ ముగిస్తే అభిమానుల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉండేదన్నారు. కోహ్లీ ఔటవడంతో గిల్, అయ్యర్‌కు ఆ ఇబ్బంది తప్పిందని తెలిపారు. కోహ్లీ 100 అంతర్జాతీయ సెంచరీలు సాధించాలని ప్రతి భారత అభిమాని కోరుకుంటున్నారని, సహచరుల సహకా రంతో ఆ ఘనత సాధిస్తే అభిమానుల ందరికీ ఆనందమే నని గావస్కర్ పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత రికార్డు జట్టు విజయావకాశాలను దెబ్బతీయకూడదని స్పష్టం చేశారు.

వెట్టువమ్ 'సెలబ్రేట్ రెసిలియెన్స్'..
ఇంటెన్స్ లుక్‌లో శోభిత



రెండు భిన్నమైన వర్గాల మధ్య జరిగే ఆధిపత్య పోరును సహజంగా తెరకెక్కించడంలో దర్శకుడు పా. రంజిత్ రూటే వేరు. ఆయన నుంచి వస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ వెట్టువమ్. ఆర్య, దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా నుంచి సెలబ్రేట్ రెసిలియెన్స్ పేరుతో మేకర్స్ ఓ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. చిన్న గ్లింప్స్‌తోనే సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో క్లియర్ కట్ హింట్ ఇచ్చారు. ఈ వీడియోలో చూపించిన మేకింగ్ షాట్స్ ప్రాజెక్ట్ చూస్తుంటే గ్రాండ్ స్కేల్‌లోనే ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతుంది. ఒక పెద్ద విలేజ్ సెట్ నడుమ వందలాది మందితో ప్లాన్ చేసిన భారీ కొట్లాటలు, గాల్లోకి లేచే కార్లు, బ్లాస్టింగ్‌లు చూస్తుంటే ఫుల్ యాక్షన్ డ్రామా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. పా. రంజిత్ స్వయంగా మైక్ పట్టుకుని సీన్లను లీడ్ చేయడం, దిలీప్ సుబ్బరాయన్ కంపోజ్ చేసిన రియలిస్టిక్ స్టంట్స్ విజువల్స్ లో మంచి ఇంటెన్సిటీ తీసుకొచ్చాయి. వీడియోలో హీరోల లుక్స్ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి. గోధుమ రంగు షర్ట్, గాగుల్స్‌తో మాస్ లీడర్‌లా నడిచివచ్చే ఆర్య, మరో సీన్‌లో తెల్లటి దుస్తుల్లో చేతిలో గన్ పట్టుకుని నిలబడే ఫ్రేమ్స్ అదిరిపోయాయి. మరోవైపు గడ్డంతో ఫుల్ రగ్గడ్ అవతారంలో కనిపించిన దినేష్ ఎనర్జీ కూడా చాలా రాగా ఉంది. వీరిద్దరి పాత్రల మధ్య నడిచే క్లాష్ తెరపై అసలైన థ్రిల్ ఇచ్చేలా కనిపిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకున్న అంశం శోభితా ధూళిపాళ్ల ప్రెజెన్స్. సాధారణంగా గ్లామరస్ పాత్రల్లో కనిపించే శోభిత, ఇందులో పూర్తి డీగ్లామరైజ్డ్ రగ్గడ్ రోల్‌లో కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేసింది. ఆమె వేసిన మార్షల్ ఆర్ట్స్ ఫైటింగ్ పోజ్, కళ్లలో చూపించిన ఇంటెన్సిటీ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. కథానాయికగానే పరిమితం కాకుండా, ఒక బలమైన పోరాట యోధురాలి తరహా పాత్రను ఎంచుకుని శోభిత తన నటనలోని కొత్త కోణాన్ని చూపిస్తోందనే నమ్మకం కలుగుతోంది.



పూర్ ఫ్యామిలీకి హఠాత్తుగా డబ్బు సంచులు దొరికితే ..
ఓటీటీలో 'ఆల్ పాస్' మూవీ!

కొన్ని కథలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూనే వినోదాన్ని పంచుతుంటాయి. సహజత్వానికి దగ్గరగా మానవ స్వభావాలను ఆవిష్కరిస్తూనే ఆలోచింపజేస్తాయి. చాలా కుటుంబాలను దగ్గరగా పరిశీలన చేస్తే ఒక విషయం అర్థమవుతుంది. పేదరిమలో ఉన్నప్పుడు వాళ్లంతా చాలా ప్రేమతో ఉంటారు. అనుకోకుండా వాళ్ల మధ్యకి డబ్బు వచ్చిపడినప్పుడు ఆ ప్రేమ కలుషితం అవుతూ ఉంటుంది. ఇందుకు అతీతంగా వ్యవహరించేవారు సంఖ్య చాలా అరుదనే చెప్పాలి. అలాంటి ఒక కథతో రూపొందిన సినిమానే 'ఆల్ పాస్'. తమిళంలో మోహన్ రంగనాథన్ నిర్మించిన ఈ సినిమాకి మైదీన్ దర్శకత్వం వహించాడు. అక్టోబర్ 9వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. దుష్యంత్ జయప్రకాశ్ .. సెంథిల్ కుమారి.. సుబ్రహ్మణ్యం శివ .. జనని కునశీలన్ .. వినోదిని వైద్యనాథన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. జేమ్స్ వసంతన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 6వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ కథ చెన్నైలోని ఒక బస్తీలో జరుగుతుంది. ఈ బస్తీలో మూడు కుటుంబాల వారు చాలా కాలంగా నివసిస్తూ ఉంటారు. ఈ పేదరికాన్ని తట్టుకుని నిలబడాలంటే, తామంతా ఉమ్మడి కుటుంబంగా ఉండటమే మార్గమని భావిస్తారు. అంతా కలిసి ఒకే ఇంట్లో ఎంతో ప్రేమగా నివసిస్తూ ఉంటారు. అదే సమయంలో ఊహించని విధంగా వాళ్ల మధ్యలోకి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చిపడుతుంది. అప్పటి నుంచి వాళ్లలో ఎలాంటి మార్పు వస్తుంది? వాళ్లతో ఏమేం చేయిస్తుంది? చివరికి వాళ్లు గ్రహించే నిజం ఏమిటి? అనేది కథ.

అనిరుధ్-కావ్యల పెళ్లి సందడి..
గ్రీస్‌కు బయల్దేరిన తలైవా, మాజీ సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటవ్వబోతున్నారు. వీరి వివాహ వేడుక గ్రీస్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితుల మధ్య జరగనుంది. ఈ వేడుకకు హాజరయ్యేందుకు సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ రోజు ఉదయం విమానాశ్రయం నుంచి గ్రీస్‌కు బయల్దేరి వెళ్లారు. దీంతో ఈ హై-ప్రొఫైల్ వివాహంపై అందరి దృష్టి నెలకొంది.
కావ్య మారన్, ప్రఖ్యాత సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఆమె ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా, సన్ టీవీ నెట్‌వర్క్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనిరుధ్ రవిచందర్ ప్రస్తుతం దక్షిణాది సినిమా పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుడిగా కొనసాగుతున్నారు. ఎంతోకాలంగా వీరిద్దరి వివాహంపై చర్చలు జరుగుతుండగా, ఇప్పుడు అధికారికంగా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి.గ్రీస్‌లో జరిగే ఈ వివాహ వేడుకకు కేవలం ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమంగా జరగనుంది. అనంతరం నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను కావ్య తల్లిదండ్రులు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయడంతో వేడుక తేదీ ఖరారైంది.చెన్నై రిసెప్షన్‌కు పలువురు అగ్రశ్రేణి ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. అయితే, ఈ వివాహ ఏర్పాట్లపై అనిరుధ్, కావ్యల కుటుంబాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రం వీరి వివాహానికి సంబంధించిన వార్తలు, ప్రముఖుల ప్రయాణ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

ఫెస్టివ్ వైబ్.. ఎలిగెంట్ లుక్ లో మృణాల్ సోయగాలు..



ఫెస్టివల్స్ మొదలయ్యాయి అంటే చాలు సెలబ్రిటీలు అందంగా, సాంప్రదాయంగా ముస్తాబవుతూ అభిమానులకు కన్నుల విందుగా కనిపిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే దంతేరాస్ సందర్భంగా తెలుగు ప్రేక్షకులను సీతామహాలక్ష్మి పాత్రతో కట్టిపడేసిన మృణాల్ ఠాకూర్ తన అధికారిక ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక వైరల్ గా మారుతున్నాయి. చీరకట్టులో కనిపించి తన ఎలిగెంట్ లుక్కుతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సీమ గుజ్రాల్ కలెక్షన్స్ నుండి ఎంపిక చేసిన ఐవరీ కలర్ డిజైనర్ సారీ కట్టుకొని , తన లుక్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ జార్జెట్ చీర పై క్లిష్టమైన పైస్లీ ఎంబ్రాయిడరీ డిజైన్ తో రూపొందించారు. మొత్తం అద్దాల పనితనం , పూసల అమరిక చాలా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీనికి మ్యాచింగ్ గా స్ట్రాపీ స్లైల్ లో నెక్ లైన్ కలిగిన హెవీ మిర్రర్ వర్క్ బ్లౌజ్ జత చేసింది. ఈ ఔట్ ఫిట్ లో మృణాల్ తన లుక్ ను మరింత రాయల్ గా మార్చడానికి మెడలో మ్యాచింగ్ హెవీ చౌకర్ నెక్లెస్ ధరించి పెద్ద చెవిపోగులతో తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. మొత్తానికైతే దంతేరాస్ స్పెషల్ సందర్భంగా తన లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఎలిగెంట్గా కనిపించి అభిమానుల హృదయాలను దోచుకుంది .అంతేకాదు మిర్రర్ వర్క్ తో డిజైన్ చేసిన శారీలో దీపావళి మొత్తం మీలోనే కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.2012లో ముజ్ సే కుచ్ కెహెతి.. ఏ ఖామోషియాన్ అనే హిందీ సీరియల్ ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. 2014లో విట్టిదండు అనే మరాఠీ చిత్రం ద్వారా నటిగా వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత హిందీ, తెలుగు చిత్రాలలో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. తెలుగు సినిమా విషయానికొస్తే 2022లో హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సీతారామం. ఈ చిత్రం ద్వారా వెండితెరకు సీతామహాలక్ష్మి పాత్రతో పరిచయమై అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమాతో ఏకంగా భారీ బ్లాక్ బాస్టర్ విజయం అందుకోవడంతో వరుసగా అవకాశాలు తలుపు తట్టాయి.ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాలలో నటించినా.. ఈమె సరైన సక్సెస్ అందుకోలేదు. ఆ తర్వాత డెకాయిట్ చిత్రంలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. రీసెంట్ గా పూజ మేరీ జాన్ అనే ఓటిటీ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం రాకాసినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కానీ దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇంకా వెలువడలేదు. ఏది ఏమైనా మృణాల్ ఠాకూర్ ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ తన స్టార్ స్టేటస్ ను మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

దీపావళి రోజున కుమ్మేసిన 'రామాయణ'



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల మార్కుకు చేరువై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ముఖ్యంగా దీపావళి పర్వదినం రోజున ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో భారీ వసూళ్లు నమోదయ్యాయి.
దీపావళి, ఆదివారం రెండూ కలిసి రావడంతో సినిమా విడుదలైన నాలుగో రోజున ఒక్కరోజే దేశీయంగా రూ.56.15 కోట్ల నెట్ వసూళ్లను ఈ చిత్రం రాబట్టింది. దీంతో 2023లో సల్మాన్ ఖాన్ చిత్రం 'టైగర్ 3' దీపావళి నాడు సాధించిన రూ.44.50 కోట్ల రికార్డును 'రామాయణ' అధిగమించింది. ఇప్పటివరకు దీపావళి పండుగ రోజున బాలీవుడ్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.ఈ సినిమా భారత్‌లో తొలి రోజు రూ.64.85 కోట్లు, రెండో రోజు రూ.48.05 కోట్లు, మూడో రోజు రూ.69.80 కోట్లు, నాలుగో రోజు రూ.56.15 కోట్ల నెట్ రాబట్టింది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ.238.85 కోట్లకు చేరగా, గ్రాస్ వసూళ్లు రూ.285.20 కోట్లుగా నమోదయ్యాయి. గతంలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' తొలి నాలుగు రోజుల్లో సాధించిన రూ.237 కోట్ల నెట్ మార్కును కూడా 'రామాయణ' దాటేసింది. ఇక ఓవర్సీస్‌లో రూ.214 కోట్ల గ్రాస్ రావడంతో, ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ.499.20 కోట్లకు చేరుకున్నాయి. దీంతో అతి తక్కువ సమయంలోనే రూ.500 కోట్ల మైలురాయిని అందుకోవడానికి ఈ చిత్రం సిద్ధమైంది.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.